కోసి మెడతో, కోసి చేతులతో వుంటు న్నది ఇలా వున్న వయస్సుకంటే ఎక్కువ వయస్సుదానిలాగా కనిపించ టానికి ఏవేవి మార్గాలున్నాయో అలో చించి వాటిని అలవాటు చేసుకోవటం మొదలుపెట్టింది తనకు త్వరగా సైట్ వస్తే బాగుణ్ణు, ఒక కళ్లజోడుకూడ పెట్టుకోవచు ననుకుంది ఇలా తనమీద తను కసిపెంచుకోవటం తన "వే ఆఫ్ లైఫ్"గా అలవాటు చేసుకుంది. అందులో తనకొక మానసికానందం లభ్యమౌతున్నట్లుగా ఫీల్ అవుతూ వచ్చింది.

పద్దెనిమిదేళ్లనించని కూతురుయొక్క ఈ పద్ధతులు చూచి అనసూయమ్మ విస్తుపోతోంది. కూతురు మనస్సులో ఏముందో తెలియక ఆ తల్లి తల్లడిల్లి పోతోంది. కూతురు తనని చులకన చేసి, కూరాకులో పురుగును తీసేసినట్లు తీసిపారేస్తున్నందుకు, కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్లు పెడసరంగా మాట్లాడుతున్నందుకు తనకు బాధలేదు తన బాధల్లా - నవ్వుతూ తుళ్ళుతూ, షోగ్గా ఈ కాలపు ఆడపిల్లలులాగా తన కూతురు వుండటం లేదనే! ఇదే విషయం భర్తతో అంటే ఆయన నవ్వేసి "ఈ రోజుల్లో ఇలా సింపుల్‌గా, మూడీగా వుండటం ఇపొక మోడరన్ ట్రైప్ లేవోయ్!" అని తీసి పారేస్తారు "కాదండీ, అమ్మాయి ఎందుకో తనలో తానే బాధపడుతోం దండీ!" అని అంటే — "నీ మొగం, పరీక్షలు దగ్గరి కొస్తోన్నాయి కదా సీరియస్‌గా చదువుకుంటోంది చదువు కోనీయ్!'' అని అంటారు. తాను మాత్రం ఇంత తేలిగ్గా తీసికోలేక, కూతురు తత్వం అర్థంకాక తనలో తాను సతమౌతోంది పాపం ఆ తల్లి!

శైలజ చదువులో వస్తుతః బ్రిలి యంట్. పైగా, తనమీద తను పెంచు కున్న కసీ, తన మనస్సు తన కేసిన శిక్ష - అందువల్ల మనస్సంతా చదువు మీద కేంద్రీకరించి చదివి పరీక్షలు రాసింది

పరీక్షలు రాసి శైలజ అన్నయ్య మోహన్ కూడ వచ్చాడు. అతను వచ్చిన నాలుగురోజులవరకు అతనితో కబుర్లాడుతూ సరదాగా గడిపేసింది. "కనీసం అన్నతో అయినా సరదాగా వుంటోంది, పోనీలే" అనుకుంది అనసూయమ్మ

కాని అదీ నాలుగురోజుల సరదాగానే మిగిలిపోయింది!

ఆ రోజు ఏముయిందంటే-

మోహన్ తల్లిని వెంటపెట్టుకుని గుడికెళ్ళాడు. శైలజ యింట్లోనే వుండి పోయింది - తల్లి వెంట వెళ్ళటం యిష్టం లేక ఆ పూట వంట తనే చేస్తోంది. ఇంతలో హాలులోంచి నవ్వులు విని పించాయి మోహన్ నవ్వుతూ ఏదో

చెప్పుతున్నాడు తండ్రి నవ్వుకూడ వినిపిస్తోంది అంత నవ్వు వచ్చే విశేషం ఏమిటబ్బా అనుకుంది వంట పని పూర్తిచేసుకుని చేతులు తుడుచుకుంటూ హాలులోకి వచ్చింది

తనను చూచిన మోహన్, "రావే చెల్లాయి, ఇందాక మేం వస్తోంటే భలే తమాషా జరిగింది-" అన్నాడు

"ఏంవిటంత తమాషా ?" నవ్వుతూ తను సోఫాలో కూర్చుంది

ఇంతకీ అతగాడు చెప్పిందేమి టంటే—తల్లీ తనూ వస్తోంటే బజార్లో తన స్నేహితుడు కలిశాడట అమ్మను చూచి, 'ఎవరీమె మీ సిస్టరా ?'' అని అన్నాడట తను అవునన్నాడట తీరా వచ్చేసేముందు మా సిస్టర్ కాదు, మా అమ్మగారన్నాడట దానికి ఆ ఫ్రెండ్ ఆశ్చర్యపోయాడట — అదీ సంగతి ! దానికి చెప్పలేక "హో" ఇదయి పోతున్నాడు, దీనికే నవ్వలేక పోతున్నారు తండ్రి గొప్పగా కులు క్కుంటున్నాడు తల్లి కన్నెపిల్లలాగా సిగ్గులు పోతోంది...ఛీ ఛీ అనుకుంది


శైలజకు ఈ "తమాషా" వినగానే మొగంలో రంగులు మారాయి; నవ్వు మొగంలోకే ఇంకిపోయింది గుండె కుదుళ్ళల్లోంచి దుఃఖంపైకి తన్ను కొచ్చింది చివాల్న లేచి, తన గదిలోకి వెళ్ళిపోయింది. తండ్రి, "అరె, వెళ్ళి పోతున్నావేంటి శైలూ ?" అన్నాడు. తను తలనొప్పిగా వుంది అంది

ఆ రాత్రి ఎవరు ఎంత బ్రతిమ లాడినా భోజనం చెయ్యలేదు మర్నాటి నుంచి తన అన్నయ్యతో కూడ మాట్లా డటం మానేసింది. యింట్లో అందరితో ముభావంగా వుంటోంది కాలేజీ లైబ్రరీ పుస్తకాలతోనే కాలక్షేపం చేస్తోంది మోహన్ కావాలని గదిలోకి వెళ్ళి మాట్లాడిస్తే ఏదో గిల్లికజ్జం పెట్టు కుంటుంది

శ్రీహరిరావుకు కూతురు ప్రవర్తన వింతగానే కనిపించింది భార్య చెప్పితే అప్పట్లో ఏదో అన్నాడుగాని, మొత్తానికి ఇదేదో ఆలోచించవలసిన విషయం లాగే వుందనుకున్నాడు

ఇంతలో రిజల్ట్సు వచ్చాయి. యిద్దరూ ఫస్టు క్లాస్‌లో పాసయ్యారు. మరో వారం తర్వాత, శైలజ ఫస్టు క్లాసులో పాసవటమే కాదు యూనివర్సి టీకే ఫస్టు వచ్చిందని తెల్సింది. అందరూ సంతోషించారు. శైలజ భావా లేమిటో ఎవరికీ తెలియదు.

శైలజ తన చిన్ననాటి స్నేహితు రాలైన అరుణతో కూడ మాట్లాడటం లేదన్న విషయం శ్రీనివాసరావుకు ఆ ఉదయమే తెల్సింది ఆ సాయంత్రం ఆఫీసునుండి రాగానే కూతురు గదిలోకి వెళ్ళాడు. శైలజ పుస్తకం చేతిలో




పట్టుకని కూర్చుంది కాని, ఆలోచనలు మాత్రం ఎక్కడో వున్నాయి

"శైలూ! అలా డాబామీద కూర్చుందాం వస్తావా?" అన్నాడు.

మారు మాట్లాడకుండా డాబా ఎక్కింది.

శ్రీహరిరావు లుంగీ కట్టుకుని రెండు గ్లాసులతో కాఫీ తీసికొని, సిగరెట్టు పెట్టె తీసికొని డాబామీద కెళ్ళారు

...శ్రీహరిరావు క్రిందకు దిగి వచ్చే సరికి రాత్రి ఏడుగంటలు దాటింది. అనసూయమ్మ వంట చేసేసి, స్నానం చేసి, పూలు గుచ్చుతూ కూర్చుంది

"తండ్రీ కూతుళ్ళ మంతనాలు అయ్యాయా? అమ్మాయి ఏదీ?" నవ్వుతూ అంది.

"బ్రెయిన్ వాష్ అయిందిగా ఇంకో గంటకుగానీ క్రిందకు దిగిరాదు". అని టవల్ తీసికొని స్నానం చెయ్యటానికి బాత్‌రూం కేసి వెళ్ళారు.

శైలజ పైకి చూస్తో డాబామీద పడుకుంది ఆకాశంలో మిలమిల మెరుస్తోన్న నక్షత్రాలను చూస్తూ ఆలోచిస్తోంది చంద్రుడంత పెద్దగా, ప్రకాశంగా లేదని తారకలు తమ వునికే నిరర్థకమనుకుంటున్నాయా? నిజానికి ఎంత పెద్ద చంద్రుడు వుంటేనేం— చుక్కలు లేని ఆకాశం బోసిగా ఏం బాగుంటుంది? ఒక విధంగా చూస్తే, ఎప్పుడో వచ్చి ఎప్పుడో పోయే నిలకడ లేని ఈ చంద్రునికంటే చీకటిపడగానే గుండెగూటిలో దీపాలు వెలిగించుకునే

ఈ చిన్ని చిన్ని చుక్కలే మేలు! చంద్రుని రాహువు మ్రింగిన రాత్రి కూడ ఇలా నిశ్చలంగా నిండుగా వుంటాయి! ఇలా చూస్తే చుక్కలే గొప్పవి ... నాన్నగారన్నట్లు ప్రతి మనిషిలోనూ ఏదో ఒక టేలెంట్ వుంటుంది భగవంతుని సృష్టిలో ప్రతి ప్రాణికి ఒక "పర్పస్" వుంటుంది తనలోని టేలెంట్‌ను వుపయోగించుకుని ఆ పర్పస్‌ను పూర్తిచెయ్యడమే జీవితానికి అర్ధం... నాన్నగారు జీవితాన్ని ఎంత చక్కగా ఎన్‌లైట్ చేశారు!

నిజంగా చూస్తే అమ్మకంటే తనెంత గొప్పది! అమ్మలో కేవలం అందం మాత్రమే వుంది. అదీ నాలుగురోజులు పోతే వన్నె తరిగిపోయే అందం! తనలో అపారమైన విద్యాతృష్ణ వుంది; రోజులు గడిచినకొద్దీ పెరిగే మేధస్సు వుంది తను యూనివర్సిటీకే ఫస్టు వచ్చింది. అమ్మ ఐదో క్లాసు కూడ పూర్తిగా చదివిందో లేదో! తనక తనలో లేని దానికోసం కుమిలిపోదు, ఇతరుల్లో అది వుండికదా అని జెలసీతో కుళ్ళిపోదు తనలో వున్న విద్యాసంపత్తును పెంచుకుంటుంది. ఎం.ఏ చదువుతుంది పిహెచ్ డి. చేస్తుంది...

—అబ్బ, ఇలా ఆలోచిస్తోంటే గుండెల్లో బరువు ఎలా మెల్లమెల్లగా కరిగిపోతూంది! ఎక్కడ్నుంచో ఏదో "బలం" మెల్లమెల్లగా తన పిచ్చి మనస్సులోకి బేలగుండెల్లోకి ప్రాకుతూ వస్తోంది! అమ్మకంటే, మరింకెవరికంటే తను తక్కువది?

శైలజ లేచి నిలబడింది. నిటారుగా నిలబడింది. బిగపట్టిన గూడలు సళ్లిచ్చాయి. పమిటను భుజంమీదుగా జారేటట్లు వేసుకుంది.

ఇవ్వాళ రాత్రి అమ్మ పక్కలో తన చిన్నప్పటి లాగా ఆమె మెడను వాటేసుకొని పండుకోవాలనుకుంది.

రేపు అరుణా వాళ్ళింటికెళ్ళాలనుకుంటూ మెట్లు దిగింది.

